BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 06 నవంబర్ 2024 www.balagamtv.com పేజీలు 4

## రూ.34కే కిలో బియ్యం !

● భారత్ బ్రాండ్ పేరుతో తక్కువ ధరలకు గోధుమ పిండి, బియ్యం అమ్మకాలు తిరిగి ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

సామాన్యులకు కేంద్రం శుభవార్త చెప్పింది. భారత్ బ్రాండ్ పేరుతో తక్కువ ధరలకు గోధుమ పిండి, బియ్యం అమ్మకాలను తిరిగి ప్రారంభించింది. దీనికి సంబంధించిన రెండో దశను మంగళవారం ప్రారంభించింది. ధరల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు తాత్కాలికంగా ఈ విక్రయాలు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్, ఈ–కామర్స్ కంపెనీల ద్వారా ఈ విక్రయాలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 3.69 లక్షల టన్నుల గోధుమలు, 2.91 లక్షల టన్నులు బియ్యాన్ని ఎఫ్‌సీఐ నుంచి సేకరించామని కేటాయించిన స్టాక్ పూర్తయ్యే వరకు విక్రయాలు కొనసాగుతాయన్నారు. అవసరమైతే అదనపు కేటాయింపులు జరుపుతామని మంత్రి తెలిపారు. గోధుమ పిండిని కిలో రూ.30కే విక్రయిస్తామని.. ఇవి 5, 10 కేజీల ప్యాకెట్స్‌లో లభిస్తాయని చెప్పారు. ఇక కిలో బియ్యం రూ.34 చొప్పున విక్రయించనున్నారు. 5, 10 కేజీల ప్యాకెట్ల రూపంలో బియ్యం లభించనున్నాయి.

# కులగణనలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్

● దీనితో దేశ అభివృద్ధి, రాజకీయ స్థితిగతులు మారతాయి
● దేశంలో కులవివక్ష ఎక్కువగా ఉంది
● కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ
● బోయిన్‌పల్లి ఐడియాలజీ సెంటర్‌లో మేధావులు బీసీ సంఘాలతో సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్**

కులగణనలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్ అని రాహుల్ గాంధీ అన్నారు. హైదరాబాద్ బోయినపల్లిలోని ఐడియాలజీ సెంటర్లో మేధావులు, బీసీ సంఘాలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలో కుల వివక్ష ఉన్న మాట వాస్తవమేనన్నారు. ప్రపంచంలోని ఇతర దేశాల కంటే భారత్‌లో కుల వివక్ష ఎక్కువగా ఉందని అన్నారు. దేశం ఆర్థికంగా బలంగా ఎదగాలంటే కుల వివక్ష ఉండకూడదని రాహుల్ గాంధీ అన్నారు.

జాతీయ స్థాయిలో కుల గణన చేపడతామని పార్లమెంట్ సాక్షిగా చెప్పిటన్టు గుర్తు చేశారు. వాస్తవాలు బయటకు రాకూడదనుకునే వారే కుల గణనను అడ్డుకుంటారన్నారు. కులగణన ద్వారా దేశంలో ఏ వర్గం ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. దీని ద్వారా దేశ అభివృద్ధి, రాజకీయ స్థితిగతులు మారతాయన్నారు. కుల గణన ద్వారా అభివృద్ధి ఫలాలు వారికి ఏ విధంగా అందించవచ్చనే అంశంపై స్పష్టత వస్తుందని తెలిపారు. అయితే, కొందరు ఈ వాస్తవాలు బయటకు రావొద్దని భావిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటివరకు కులవివక్షపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.



తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తేస్తామన్నారు. దేశంలోని పలు వ్యవస్థలు, కంపెనీల్లో ఎంతమంది దళితులు, బీసీలు ఉన్నారు. ఈ వివరాలు అడిగేందుకు ఎందుకు భయపడుతున్నారు. వీటిని అడ్డుకునే వాళ్లు వాస్తవాలు బయటకు రాకుండా చేయాలని చూస్తున్నారు.. అంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కులగణనను సమగ్రంగా జరిపించే బాధ్యతను తాము తీసుకుంటామనిస్పష్టంచేశారు.



## అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకే కుల గణన : సీఎం రేవంత్

అందరికీ సమాన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కులగణన సర్వేను ప్రభుత్వం బాధ్యతగా పరిగణిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. బోయినపల్లిలోని ఐడియాలజీ సెంటర్లో నిర్వహించిన కులగణన సంప్రదింపుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. అందుకు కులగణన ప్రక్రియే నిదర్శనమన్నారు. కాగా, కుల గణన సర్వే కోసం.. పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ నేరుగా రావడం గొప్ప విషయమన్నారు. ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలన్నారు. కులగణన సర్వేకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కుల గణన పూర్తి చేసి రాష్ట్రంలోని బీసీలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న కుల గణనను 2025 జనాభా గణనలో పరిగణనలోకి తీసుకోవాలని వేదికపై తీర్మానం చేశారు. ఇటీవల గ్రూప్–1 పరీక్షలు సమర్థంగా నిర్వహించామని.. అందులో ఎక్కువమంది ఓబీసీ అభ్యర్థులే ఉన్నారని చెప్పారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2025లో కేంద్రం జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కేబినెట్‌లో తీర్మానం చేశామని తెలిపారు.



## మహిళపై సామూహిక లైంగికదాడి

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళపై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడి చేసిన దారుణ ఘటన హైదరాబాద్ మధుర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. . వివరాల్లోకి వెళ్తే.. ఇళ్లలో పనిమనిషిగా చేసే ఓ మహిళ సోమవారం రాత్రి కొండాపూర్‌లో పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు తమ రూమ్‌లో బట్టలు ఉతకాలని చెప్పి తీసుకెళ్లారు. అనంతరం సదరు మహిళను రూమ్‌లో బంధించి పాశవికంగా లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం నిందితులు పారిపోగా మహిళ అక్కడి నుంచి ద తప్పించుకుని మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## అమెరికా ఎన్నికలు ప్రారంభం



● తొలి ఫలితం వచ్చేసింది

**బలగం టీవి, హైదరాబాద్**

అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ మొదలైన కొన్ని గంటలకే తొలి ఫలితం కూడా వచ్చేసింది. ఓ చిన్న కౌంటీలో ఓటింగ్ పూర్తైన వెంటనే ఫలితాన్ని వెల్లడించారు.

న్యూహ్యాంప్‌షైర్ రాష్ట్రంలోని డిక్స్‌విల్లే నాచ్‌లో మొత్తం ఆరుగురు ఓటర్లు ఉన్నారు. అందులో డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మూడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కు మూడు ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ పూర్తైన 15 నిమిషాల తర్వాత ఫలితాలను వెల్లడించారు. కాగా, 2020లో డిక్స్‌విల్లే నాచ్ వాసులు డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌కే ఓటు వేశారు. ఆ ఎన్నికల్లో ఆయనే విజయం కూడా సాధించారు. కాగా, ఎలక్షన్ డే రోజున డిక్స్‌విల్లే నాచ్‌లో అర్ధరాత్రి నుంచే పోలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దేశంలోనే తొలి ఫలితం వెలువడే ప్రదేశంగా ఈ కౌంటీ పేరుగాంచింది.

## యూపీ మదర్సా చట్టం రాజ్యాంగబద్ధమే..



● సుప్రీంకోర్టు తీర్పు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఉత్తరప్రదేశ్ బోర్డు ఆఫ్ మదర్సా– 2004 ఎడ్యుకేషన్ చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. బోర్డు లౌకిక న్యాయ సూత్రాలను ఉల్లంఘించిందంటూ దానిని రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును మంగళవారం సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. ఈ చట్టం లౌకిక వాద సూత్రాన్ని ఉల్లంఘించిందని హైకోర్టు తప్పుగా అభిప్రాయపడిందని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. యూపీ మదర్సా విద్యా చట్టాన్ని తాము సమర్థిస్తున్నామని పేర్కొంది. కాగా, యూపీలో మదర్సాల విద్యా చట్టం చెల్లదని, అందువల్ల మదర్సా విద్యాసంస్థలను మూసివేసి దానిలోని విద్యార్థులను రాష్ట్రంలోని వేరే విద్యాసంస్థల్లోకి మార్చాలంటూ గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటేనే హడలిపోతున్నారు

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**



రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటేనే బిల్డర్లు హడలిపోతున్నారని, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు తీసుకొస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాడ్డాక ఏం మార్పులు తీసుకొచ్చిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తెలంగాణ రియల్టర్స్ ఫోరం సమావేశంకు మంగళవారం మధ్యాహ్నం హాజరైన కేటీఆర్.. రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ‘ తెలంగాణలో ఎక్కడైనా ఎకరం భూమి ధర రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల కంటే తక్కువ లేదు. ఇవాళ తెలంగాణలో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎలా ఉందో అందరికి తెలుసు. మార్పు...మార్పు అని ఊదర కొట్టింద్రు. మార్పు బాగుందా ? అని అన్నారు.

నన్ను ఇటీవలే కల్సిన ఒక బిల్డర్ పరిస్థితులు బాగా లేవని అన్నారు, నాకు తెలిసిన ఒకే ఒక విద్య రియల్ ఎస్టేట్ అని ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి అన్నారు. 11 నెలల నుంచి చూస్తున్న ఒక్క పాజిటివ్ నిర్ణయం లేదు ఇప్పుడు రియల్ ఎస్టేట్‌కు అనుమతులు గాలిలో దీపం.హైడ్రా బ్లాక్ మెయిల్ చేసే%శీ%దుకు ఇవాళ ఎవరైనా లేక్ వ్యూ అని పెట్టుకోవాలంటే భయపడుతున్నారు. ప్రాజెక్టు లు రద్దు...ఒక్క కొత్త ప్రాజెక్టు వద్దు అన్నట్టు ఉంది కాంగ్రెస్ సర్కార్ పరిస్థితి’ అంటూ విమర్శించారు కేటీఆర్. ‘గత పదేళ్లలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారు కేసీఆర్. మేము మంచిగా చేసిన కరెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసింది. రైతులు మోస పోయినం అని అంటున్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని కాంగ్రెస్ కార్యకర్తలే అంటున్నారు’ అని కేటీఆర్ ఆరోపించారు.

### అతివాద శక్తులకు రాజకీయాల్లో చోటు కల్పిస్తున్నారు

● భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్



**బలగం టీవి, న్యూఢిల్లీ**

కెనడా ప్రభుత్వంపై భారత విదేశాంగ శాఖ మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కెనడాలో ఒక హిందు దేవాలయంపై ఖలిస్థానీ మద్దతు దారులు దాడి చేసిన విషయం విదితమే. ఆ దాడి నేపథ్యంలో జైశంకర్ తీవ్రంగా స్పందించారు. కెనడాపై తాను మూడు విషయాలు చెప్పాలని అనుకుంటున్నానని, ఒకటి నిరాధార ఆరోపణలు చేస్తోందని, రెండవది భారత దౌత్యవేత్తలపై నిఘా పెట్టిందని, అది సబబు కాదని కేంద్ర మంత్రి అన్నారు.మూడవది మనం అంతా చూస్తున్నామని, అందుకు ఆ వీడియోనే సాక్షమని ఆలయంపై దాడి ఘటనను ఉద్దేశించి జైశంకర్ చెప్పారు. వాటన్నిటినీ పరిగణనలోకి తీసుకుంటే అతివాద శక్తులకు రాజకీయాల్లో చోటు కల్పిస్తున్నారనేది స్పష్టం అవుతోందని ఆయన విమర్శించారు. కాన్‌బెర్రాలో ఆస్ట్రేలియా విదేశాంగ శాఖ మంత్రి పెన్నీ వాంగ్‌తో కలసి విలేకరుల గోష్ఠిలో పాల్గొన్న జైశంకర్ కెనడాలోని తాజా సంఘటన. ఆ దేశంతో ప్రస్తుతం సాగుతున్న దౌత్య వివాదంపై ప్రశ్నలకు సమాధానంగా ఆ వ్యాఖ్యలు చేశారు.

కాగా, అమెరికా ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఆ దేశంలో భారత్‌కు సత్సంబంధాలు కొనసాగుతాయని విదేశాంగ శాఖ మంత్రి అన్నారు. డొనాల్డ్ ట్రంప్‌తో సహా గత ఐదు ప్రభుత్వాల హయాంలో ఆ దేశంతో భారత్ మంచి సంబంధాలు కొనసాగించిందని ఆయన వెల్లడించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఉభయ దేశాల మధ్య స్నేహం పురోగతి సాధిస్తుందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేటి నుంచి ఒంటిపూట బడులు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో ఈనెల 6వ తేదీ నుంచి కుల గణన ప్రారంభం కానుంది. ఈ కుల గణన సర్వేలో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీ టీచర్లు పాల్గొననున్నారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మినహాయింపును ఇచ్చింది. సర్వేలో 35,559 మంది టీచర్లు, 3,414 మంది ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు పాల్గొననున్నారు. వీరే కాకుండా 6,256 మంది మండల రిసోర్స్ పర్సన్‌లు కూడా కుల గణన సర్వేలో పాల్గొననున్నారు. మరో రెండు వేల మంది మినిస్టీరియల్ సిబ్బందితో కలిపి మొత్తం 48, 229 మంది కుల గణన సర్వేలో పాల్గొననున్నారు. ఈ సర్వే 3 వారాల పాటు కొనసాగనుంది. దీంతో ప్రాథమిక పాఠశాలలు మూడు వారాల పాటు ఒక్క పూటే పనిచేయనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేస్తాయి. ఆ తర్వాత ఉపాధ్యాయులు సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలి.

### ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 5 వేలు ఇవ్వండి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్**

ఇందిరా పార్క్ దగ్గర ధర్నా చౌక్ లో ఆటో డ్రైవర్స్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడికి ఆటో లో వచ్చాను.. తమ జీవితాలన్ని అస్తవ్యస్తంగా అయ్యాయని నేను ఎక్కిన ఆటో డ్రైవర్ అన్నారు.. రాష్ట్రంలో ఉన్న ఆరున్నర లక్షల ఆటో డ్రైవర్ల పరిస్థితి ఇలాగే ఉంది.. ఇవాళ రాహుల్ గాంధీ వస్తున్నారు.. ఇదే రాహుల్ గాంధీ గత ఏడాది ఆటోలో జనాల దగ్గరికి వచ్చి చాలా విషయాలు చెప్పారు.. కానీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. అలాగే,ఇంటింటికి సంక్షేమం అన్నావు.. అత్తలకు, కోడళ్ళకు పైసలు ఇస్తాన్నావు.. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా ఇస్తే మేము వ్యతిరేకం కాదు.. రైతుల ఆత్మహత్యలు మొదలైనాయి.. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు మొదలయ్యాయని కేటీఆర్ అన్నారు. ఇక, అసెంబ్లీలో వివరాలు పెడితే మమ్మల్ని విమర్శించారని కేటీఆర్ అన్నారు. ఆడ పిల్లలు మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో కొట్లాడుకోకుండా చూడండి.. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు కాదు.. నెలకు 5వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్స్యూరెన్స్ ప్రభుత్వమే ఇవ్వాలి.. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ఇన్స్యూరెన్స్ కూడా రద్దు చేశారు.. సచివాలయంలో ఉన్న అధికారులకు వినిపించేలాగా విజిల్ వెయ్యాలి.. అలాగే, మీకోసం వచ్చిన వాళ్లకు వ్యతిరేకంగా మీరు మాట్లాడటం సరినది కాదు.. పోలీసులు కూడా ఎక్కువ మంది రాకుండా కట్టడి చేశారు.. పోలీసులు కూడా కష్టంలోనే ఉన్నారు.. వాళ్ల రోడ్ ఎక్కారు.. డ్యూటీ చెయ్యండి.. కానీ పేదల పట్ల కనీసం ఆలోచన చేయాలని కోరారు. పోలీసులన్నలకు విజ్ఞప్తి స్పెషల్ పోలీసులను నమ్మడం లేదు.. సచివాలయంలో స్పెషల్ పోలీసులను తీసేసి బెటాలియన్ దింపాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

ఇక, మాకు ఆటో డ్రైవర్ల కెపాసిటీ తెలుసు.. మమ్మల్ని ఓడగొట్టడంలో మీ పాత్ర ఉంది.. ఈ ప్రభుత్వాన్ని ఇంకా నాలుగేళ్లు భరించాలని కేటీఆర్ అన్నారు. ఈ నాలుగేళ్లు ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతాం.. అన్ని జెండాలు ఒక్కటై పోరాటం చేయ్యాలి.. ఏఐటీయూసీ, ప్రభుత్వంతో కలిసి ఉంది అయినా కూడా పోరాటం కోసం రోడ్డు ఎక్కారు.. సీఐటీయూ లాంటి సంఘాలు కూడా ఉద్యమాలు చేస్తున్నాయి.. కార్మిక సంఘాల ఐక్యంగా పోరాడాలి.. మా పూర్తి మద్దతు మీకు ఇస్తున్నాం.. మా బీఆర్టీయూ సంఘంతో కలిసి మీరు చేసే ప్రతి పోరాటంలో మేము ఉంటాం.. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కోసం మనం నినదించాలి.. అంటూ అందరితో కలిసి కేటీఆర్ స్లొగన్స్ ఇచ్చారు.

### సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ

# ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

- **ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ కేసులు నమోదు చేయాలి...**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

పోలీస్ సిబ్బంది తరచు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి,గ్రామాల్లో ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులు తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.

మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పరిశీలించి స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ అధికారుల, సిబ్బంది పని తీరు భేషుగ్గా ఉందన్నారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వివిధ సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాల ని,పోలీస్ అధికారులు, స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ, స్టేషన్ పరిధిలోని రౌడి షీటర్స్,హిస్టరీ షీటర్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ , డ్రంక్ అండ్ డ్రైవ్ లు ఏర్పాటు చేయాలని,గంజాయి కిట్ల సహాయంతో అనుమానిత వ్యక్తులకు టెస్ట్ లు నిర్వహించాలని,స్టేషన్ పరిధిలో గంజాయి నివారణకు పకడ్బందీగా చర్యలు చెపట్టాలని, గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి లేదా, డయల్100 కి సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ మొగిలి,ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

**నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం...**

నేరాల నియంత్రణ కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో గ్రామ ప్రజాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 07 సీసీ కెమెరాలను గ్రామ ప్రజలతో కలిసి ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని,గ్రామాల్లో సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని, సీసీ కెమెరాల ద్వారా జిల్లాలో చాలా కేసులు చేదించడం జరిగిందని అన్నారు .నేరాల నియాత్రణలో కేసుల ఛేదన సమయంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రామలలో రాత్రింబవళ్లు ప్రజలకు రక్షణగా నిలుస్తాయన్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలు లేని గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు,వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చి పోలీస్ వారికి సహకరించాలనిఅన్నారు .ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పకుండా ధరించలన్నారు. కులం పంచయాతి పేరుతో కుల బహిష్కరణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అలాంటి వారి సమాచారం పోలీస్ వారికి అందించకలని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఏదైనా సమస్య ఉంటే నిర్భయంగా పోలీస్ వారిని సంప్రదించాలని,గ్రామాల్లో గంజాయి, ఆసాంఘిక కార్యకలపాపై పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు.ఇక్కడ డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలి..

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాల, చిన్న బోనాల, ముష్టిపల్లి, సర్దాపూర్ ల్లోని కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. అనంతరం రైతులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, ఆయా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు . జిల్లాలో ఐకేపీ, మెప్మా, పీఏ సీ ఎస్, డీసీఎంఎస్ విభాగాల ఆద్వర్యంలో ఇప్పటికే 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సీసీఐ ఆద్వర్యంలో దాదాపు ఐదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని అన్నారు . వరి, పత్తి పండించిన రైతులు తమ పరిధిలోని కేంద్రాలకు పంట ఉత్పత్తులను తరలించాలని సూచించారు.



## రైతుల ఫిర్యాదు పై స్పందించిన అధికారులు

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలానికి చెందిన సర్వే నంబర్ 1156 లో తాడూరు శివారులో గల లావని పట్టా భూమిలో సంద్రా వాగు కబ్జాకు గురి అయ్యిందని తన అధికార అండదండలతో బావిని తవ్విన ఓ మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య అని కలెక్టర్ కు సోమవారం రోజున రైతు లు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు సంద్రవాగును పరిశీలించి సర్వేయర్ ని త్వరలోనే పిలిపించి లావని పట్టా మరియు సంద్ర వాగు కొలతలు కొలిచి 15 రోజులలోగా చర్యలు చేపడతామని ఇరిగేషన్ ఎఈ సాగర్ తెలిపారు.అధికారులు ఆర్ ఐ దినేష్,వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మి రాజాం లు పరిశీలించారు.

## వరి దిగుబడిలో తెలంగాణా రికార్డ్..

**బలగం టీవి, హైదరాబాద్**

వరి దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం రికార్డు సృష్టిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోందన్నారు. భారతదేశం మొత్తం మీద ఎన్నడూ రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి రాలేదని స్పష్టం చేశారు.మంగళవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు లోక్‌సభ, పాలక మండలి సభ్యులు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాన్యంకొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. 60.80 లక్షల ఎకరాలలో ప్రభుత్వం అంచనా వేస్తున్న దిగుబడిలో 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు. అందులో 47 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలుగా,44 లక్షలు దొడ్డు రకం ఉంటాయన్నారు. ఖరీఫ్ నుండి సన్నాలకు బోనస్ గా క్వింటా ఒక్కింటికి రూ.500 ప్రకటించిన నేపద్యంలో రైతులు సన్నాల వైపు మొగ్గు చూపరన్నారు. దిగుబడిలో సన్నాలు 47 లక్షల అంచనాయో ఇందుకు నిదర్శనమన్నారు. ఈ మొత్తం కొనుగోలుకు గాను 30 వేల కోట్లు అవుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 20 వేల కోట్లు విడుదల చేసిందని ఆయన తెలిపారు. పరిస్థితులను బట్టి అప్పటికప్పుడు అదనంగా నిధులు విడుదల చేసేందుకు సిద్దంగా ఉన్నమన్నారు. ఈ నేపథ్యంలో దాన్యం కొనుగోలు విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## రెసిడెన్షియల్ స్కూళ్లను గాలికి వదిలేయడం మీ విధానమా

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూళ్లకు కూడా సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ రంగు పులిమారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏ రంగు పులిమినా ఫర్వాలేదు.. చలికాలం వచ్చింది రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు రగ్గులు కూడా లేవట వాటి సంగతి చూడు రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు.

కేసీఆర్ హయాంలో 1023 ప్రభుత్వ గురుకులాలు ఏర్పాటు అయ్యాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి లక్షా 20 వేల రూపాయలు కేసీఆర్ వెచ్చించారు. కేసీఆర్ హయాంలో రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు అత్యున్నత సంస్థల్లో అడ్మిషన్లు పొందారు. డాక్టర్లు, ఇంజినీర్లు, పైలట్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారు. ఎవరెస్టుతో పాటు ప్రపంచ పేరు ప్రఖ్యాతులు ఉన్న పర్వత శిఖరాలను అధిరోహించారు. కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఎవరెస్టు స్థాయికి పెంచితే.. రేవంత్ రెడ్డి రెసిడెన్షియల్ స్కూళ్లలో ఎలుకలు విద్యార్థులను కరిచే స్థాయికి తీసుకుపోయారని హరీశ్‌రావు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శంకుస్థాపనలు చేశారు. వాటిని కట్టేదాకా ఉన్న రెసిడెన్షియల్ స్కూళ్లను గాలికి వదిలేయడం మీ విధానమా? ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడిగా ఈ ప్రభుత్వం భావించాలి. గురుకులాలను నడపడం గురుతర భాద్యతగా భావించాలే తప్ప గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరించొద్దు. గురుకులాలను సమీక్షించేందుకు గతంలో సెంట్రల్ కమాండ్ సిస్టం ఉండేది. ఇప్పుడు అలాంటి కమాండ్ సిస్టం లేదు. ప్రతి రెసిడెన్షియల్ స్కూల్‌కు ఓ హెల్త్ సూపర్ వైజర్ ఉండాలి. విద్యార్థులు జబ్బు పడితే కనీస మందులు అందుబాటులో లేవని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## 26న దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు

- **కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల పిలుపు**

**బలగం టీవి, హైదరాబాద్**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల కాలంలో హిందుత్వ ఎజెండాతోటి అధికారానికి వచ్చిన ఎన్డీయే బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదనిసంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ పశ్యపద్మ అధ్యక్షతన నేడు జరిగిన సమావేశంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టియుసి విజయ్ కుమార్, ఐఎఫ్‌టియు వేములపల్లి వెంకట్రామయ్య, టియుసిఐ సూర్యం, ఐఎఫ్‌టియు శ్రీనివాస్, సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్, రైతు స్వరాజ్య వేదిక విస్సా కిరణ్ కుమార్, బికెఎంయు కె.కాంతయ్య, హెచ్ఎంఎస్ యం.డి.అంజద్ తదితర నాయకులు అన్నారు. వారు మాట్లాడుతూనవంబర్ 26న దేశవ్యాపితంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీలకు జరుగుతున్న అన్యాయాలపై కేంద్ర కార్మిక సంఘాల పిలుపును విజయవంతం చేయాలని నిర్ణయించాయి. దీనిలో భాగంగా నవంబర్ 18న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల నుండి రాష్ట్ర సదస్సు జరుపుటకు నిర్ణయించటం జరిగిందని వారు తెలిపారు. ఈ సదస్సును ఆన్‌లైన్ బహిరంగ సభ ద్వారా జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి లక్షలాది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పాల్గొనేలా చేయాలని సమావేశం కోరింది. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లక్షలాది కరపత్రాలు, వేలాది వాల్‌పోస్టర్లు ముద్రించి మారుమూల గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు విస్తృత ప్రచారం చేయాలని సమావేశం నిర్ణయించిందని వారు తెలిపారు. నవంబర్ 15న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి అనేక మంది నిరసన కార్యక్రమాలలో పాల్గొనేలా చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

# 6 గంటలకు మించి ధాన్యం వెయిట్ చేయడానికి వీలు లేదు..



- మిల్లుల వద్ద ధాన్యం దించుకోని పక్షంలో తాత్కాలిక గోదాములకు తరలించాలి..
- వరి ధాన్యం కొనుగోలు వివరాలు ప్రతిరోజు అందించాలి
- వరి ధాన్యం కొనుగోలు గోడప్రతి ఆవిష్కరణ..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రైస్ మిల్లుల వద్ద ధాన్యం దించుకొని పక్షంలో వెంటనే తాత్కాలిక గోదాములకు సదరు ధాన్యాన్ని తరలించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో కొనుగోలు కేంద్రాల వారిగా ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, లోడింగ్ ఎలా జరుగుతుంది, అవసరమైన వాహనాలు సిద్ధంగా ఉన్నాయా మొదలగు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతుల దగ్గర నుంచి ధాన్యం కొనుగోలు కోసం మొత్తం 248 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయగా,ఇప్పటి వరకు 246 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని అన్నారు.

నాణ్యత ప్రమాణాలు గల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర పై కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించే విధంగా కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



జిల్లాలో ఎక్కడైనా రైస్ మిల్లర్లు ధాన్యం దించు కోవడానికి ఇష్టపడని పక్షంలో వెంటనే ప్రభుత్వం గుర్తించిన తాత్కాలిక (ఇంటర్మీడియట్) గోదాములకు సదరు ధాన్యాన్ని తరలించేలా పౌరసరఫరాల శాఖ అధికారి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సిరిసిల్ల జిల్లా అప్పెరల్ పార్కు లోని గోదాములను తాత్కాలిక (ఇంటర్మీడియట్) గోదాములగా గుర్తించామని, మిల్లర్లు దాన్యం దించుకొని పక్షంలో ఇక్కడికి తరలించాలని, రైస్ మిల్లు వద్ద ఆరు గంటలకు మించి ధాన్యం వెయిట్ చేయడానికి వీలు లేదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దాన్యం కొనుగోలు పై ప్రభుత్వం పట్ల సానుకూలత వచ్చే విధంగా అధికారులు పని చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, సన్న రకం ధాన్యానికి బోనస్ మొదలగు వివరాలను ప్రతి రోజు అందించాలని అన్నారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు సన్న రకం ధాన్యానికి 500 బోనస్ అందించు (పోస్టర్) గోడప్రతి ని ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ,డీఆర్డీవో శేషాద్రి , డిసిఎస్ వో వసంత లక్ష్మి, డీఎం. సివిల్ సప్లై రజిత, డిసిఓ రామకృష్ణ , డి.ఎం.సి. మెప్మ రాజేశం , డిసిఎంఎస్. సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించాలి



- సజావుగానే ధాన్యం కొనుగోళ్లు.
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..

**బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అదికాలను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మొత్తం ఎంత మంది రైతులు ధాన్యం కేంద్రంలో పోశారు, ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్లు ధాన్యం సేకరించారని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆరా తీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రైతులందరూ తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని, కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దళారులకు విక్రయించవద్దని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయించాలి..



- త్వరలో బ్యాంక్ గ్యారంటీ అందజేస్తాం..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ఖరీఫ్ ధాన్యం తమకు కేటాయించాలని పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో అదనపు కలెక్టర్ ను పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లు కలిశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించే ధాన్యానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ త్వరలోనే అందజేస్తామనిఅన్నారు . తమకు కేటాయించే ధాన్యానికి మాత్రమే బ్యాంక్ గ్యారంటీ ఇస్తామనిఅన్నారు . కొనుగోలు కేంద్రాల ద్వారా పాత గన్ని బ్యాగుల్లో ధాన్యం పంపాలని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఇచ్చే బియ్యానికి సరిపడా కొత్త గన్ని బ్యాగులు ఇవ్వాలని, తమకు సన్న ధాన్యం కేటాయించవద్దని అన్నారు వినతి పత్రం అందజేసిన వారిలో పారా బాయిల్డ్ రైస్ మిల్లుల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.


## అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు సుంకపాక విక్రంబాబు, ఉపాధ్యక్షులు జోగు శంకర్,గౌరవ అధ్యక్షులు జోగు రవీందర్,సుంకపాక ప్రవీణ్,దుమాల రామస్వామి, కోశాధికారి సుంకపాక సురేష్,ప్రధాన కార్యదర్శి కొంకటి సతీష్,జిల్లెల్ల మధు,కార్యదర్శి బొడ్డు అనిల్, సలహాదారులు సుంకపాక లక్ష్మణ్, కల్లేపల్లి సతీష్,దావా కనుకయ్య,గౌరవ సభ్యులు దమ్మ వెంకటరమణ, పార్లపల్లి మధు,సుంకపాక అంజయ్య, కొంకటి మధు,బొడ్డు శంకర్ లను ఎన్నుకోవడం జరిగినది



# భారత్‌లోనే 2036 ఒలింపిక్స్ నిర్వహిస్తాం..!



- ఇంటర్నేషనల్ ఒలింపిక్ సంఘానికి లేఖ రాసిన భారత ఒలింపిక్ సంఘం


**బలగం టీవి, హైదరాబాద్**

2036లో విశ్వ క్రీడలైన ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి వ్యక్తీకరణ తెలియజేస్తూ భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ)–అంతర్జాతీయ ఒలింపిక్ సంఘానికి(ఐఓసీ) ఫ్యూచర్ హొస్ట్‌కమిషన్‌కు అధికారికంగా లేఖ పంపినట్లు తెలుస్తోంది. ఈ లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఐఓఏ అక్టోబర్ 1న పంపించినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు సమాచారం.

అయితే వచ్చే ఏడాది జరిగే ఐఓసీ ఎన్నికలు జరిగేంత వరకు హొస్ట్‌పై నిర్ణయం తీసుకోరు. మరోవైపు, 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం చాలా దేశాలతో భారత్ పోటీ పడాల్సి ఉంటుంది. సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే, వంటి అనేక దేశాలు ఒలింపిక్స్ నిర్వహణపై ఆసక్తి చూపిస్తున్నాయి. భారత్ మొదటి 2032 ఒలింపిక్స్ నిర్వహించేందుకు ఆసక్తి చూపించింది. కానీ కొన్ని కారణాల వల్ల 2036లో నిర్వహించాలని నిర్ణయించుకుంది. అయితే విస్తృత స్థాయిలో బిడ్డింగ్ కాకుండా ఆసక్తి ఉన్న దేశాల నుంచి వచ్చే అప్లికేషన్లను పరిశీలించి ఐఓసీ నాయకత్వ విభాగం ఈ హొస్టింగ్ రైట్స్‌ను కట్టబెట్టే ఆస్కారం ఉంది. స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టింగ్ హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజల ఆదరణ, ఇలా ఏ రకంగా చూసుకున్నా భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం వల్ల ఐఓసీకి లాభం చేకూరే అవకాశం ఉంది. అందుకే ఐఓసీ కూడా భారత్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తితో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇండియా బిడ్ ఓకే అయితే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒలింపింక్స్ క్రీడలు జరుగుతాయి.

# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఫిక్సింగ్..!

## 24 మంది ఆటగాళ్లపై, మూడు క్లబ్స్‌పై నిషేధం




**బలగం టీవి, హైదరాబాద్**

భారత ఫుట్‌బాల్‌లో మ్యాచ్ ఫికింగ్స్ కలకలం రేపింది. మిజోరం ప్రీమియర్ లీగ్‌లో పలువురు ఆటగాళ్లు ఫిక్సింగ్‌కు పాల్పడ్డారు. దాంతో, స్థానిక పోలీసుల సాయంతో విచారణ చేపట్టిన మిజోరం ఫుట్‌బాల్ సమాఖ్య.. మ్యాచ్ ఫిక్సింగ్‌తో సంబంధమున్న 24 మంది ఆటగాళ్లపై, మూడు క్లబ్స్‌పై నిషేధం విధించింది.మ్యాచ్ ఫిక్సింగ్‌కు సూత్రధారులుగా వ్యవహరించిన ఇద్దరిపై ఏకంగా జీవితకాల నిషేధం విధిస్తూ ఎంఎఫ్ఏ తీర్మానించింది. ఐదుగురు ఆటగాళ్లపై నాలుగేండ్లు, 10మందిపై మూడేండ్లు, 8 మందిపై ఏడాది పాటు నిషేధం ఉంటుందని మిజోరాం ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించింది.

మ్యాచ్ ఫిక్సింగ్‌తో సంబంధం ఉన్న మూడు క్లబ్స్‌లో ఒకటైన సిహ్‌ఫిర్ వెంఘులున్ ఎఫ్‌సీ ఈ మధ్యే ముగిసిన మిజోరం ప్రీమియర్ లీగ్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఐజ్వాల్ ఎఫ్‌సీతో జరిగిన సెమీ ఫైనల్లో సిహ్‌ఫిర్ ఓటమిపాలైంది.

# విరాట్ కోహ్లీకు వెలువెత్తిన శుభాకాంక్షలు




**బలగం టీవి, హైదరాబాద్**

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ కోహ్లీ36వ వసంతంలో అడుగుపెట్టాడు . ఈ సందర్భంగా కోహ్లీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సహచర ఆటగాళ్లు, సీనియర్ క్రికెటర్లు, అభిమానులు ఈ క్రికెట్ కింగ్‌కు విషెస్ తెలుపుతున్నారు. ఇక ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక సైతం కోహ్లీకి వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. ఒడిశాలోని పూరి సాగర తీరంలోప్రత్యేకంగా సైకత శిల్పం రూపొందించారు. క్రికెట్ మైదానంపై విరాట్ ఉన్నట్టు ఈ శిల్పాన్ని ఎంతో చక్కగా రూపొందించారు. బ్యాట్‌పై హ్యాపీ బర్త్‌డే విరాట్ అంటూ రాసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఈ సైకత శిల్పం నెటిజన్లను, కోహ్లీ అభిమానులను విశేషంగా ఆటకట్టుకుంటోంది.

# మూడు స్థానాలు ఎగబాకిన టీమ్‌ఇండియా కెప్టెన్



**బలగం టీవి, హైదరాబాద్**

మహిళల ఐసీసీ వన్డే ర్యాంకులు వెలువడ్డాయి. టీమ్‌ఇండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(654) మూడు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు దూసుకెళ్లింది. న్యూజిలాండ్‌పై వన్డే శతకం బాదిన స్మృతీ మంధాన ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం మంధాన(728) నాలుగో స్థానంలో కొనసాగుతోంది. గతంతో పోలిస్తే 703 పాయింట్ల నుంచి 728కి చేరింది. దీంతో టాప్ –3 ర్యాంకుకు చేరువగా వచ్చింది. లారా వాల్వార్డ్‌ట్ (756), నాట్ స్కివెర్ బ్రంట్ (760), చమరి ఆటపట్టు (733) మూడు స్థానాల్లో నిలిచారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (538) భారత్ తరపున టాప్–20లో నిలిచిన మూడో ప్లేయర్ కావడం విశేషం. ప్రస్తుతం ఆమె ఒక ర్యాంక్‌ను మెరుగుపర్చుకుని 19వ ప్లేస్‌లో ఉంది.

మరోవైపు, బౌలింగ్ విభాగంలో దీప్తి శర్మ రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం 703 పాయింట్లు సాధించిన ప్లేయర్ దీప్తి శర్మ ర్యాంకు విషయంలో మాత్రం మార్పు లేదు. ఇక ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లెస్టోన్ (770) తొలి స్థానంలో ఉంది. భారత యువ బౌలర్ ప్రియా మిశ్ర ఏకంగా 77 స్థానాలను మెరుగుపర్చుకోవడం విశేషం. ఫలితంగా మొదటి సారి టాప్–100 ర్యాంకుల్లోకి దూసుకొచ్చింది. ప్రస్తుతం 271 పాయింట్లతో 83వ స్థానం దక్కించుకుంది. రేణుకా సింగ్ (424) కూడా నాలుగు స్థానాలను మెరుగుపర్చుకుని 32వ ర్యాంకుకు చేరింది. కాగా, ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ ఒక్క ప్లేయరే భారత్ నుంచి టాప్–10లో నిలిచింది. దీప్తి 378 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ విభాగంలో సౌతాఫ్రికా ప్లేయర్ మరిజన్నె కాప్ (404) అగ్రస్థానంలో ఉంది.

ఇదిలా ఉండగా, ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో 25 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 21 పాయింట్ల నుంచి 20 పాయింట్లకు పడిపోయిన న్యూజిలాండ్ ఆరో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ 28 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి.

# ఐపీఎల్ మెగా వేలం తేదీలు, వేదిక ఖరారు..




**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ మెగా వేలం తేదీలు వేదిక ఖరారయ్యాయి. నవంబర్ 24, 25 తేదీల్లో వేలం జరగనుంది. ఈ మేరకు సౌదీ అరేబియాలోని జెడ్డాలో మెగా వేలం నిర్వహించనున్నట్లు ఐపీఎల్ పాలకమండలి ప్రకటించింది. మొత్తంగా వేలంలో 1,574 క్రికెటర్లు పాల్గొంటారని పేర్కొంది. అయితే ఫ్రాంఛైజీలు గరిష్టంగా 204 మందిని మాత్రమే తీసుకునే అవకాశం ఉందని తెలిపింది. వాస్తవానికి రియాద్ వేదికగా ఈ వేలం జరగనుందని వార్తలు వచ్చినా.. చివరి నిమిషంలో వేదిక మార్చారు. గతేడాది ఐపీఎల్ వేలం దుబాయ్ వేదికగా జరిగింది. దీంతో వరుసగా రెండోసారి విదేశాల్లోనే వేలం జరగనుంది.

కాగా ఈసారి మెగా వేలంలో మొత్తం 1,574 మంది క్రికెటర్లు పేర్లు నమోదు చేసుకున్నారని ఐపీఎల్ పాలకవర్గం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఇందులో 320 మంది క్యాప్డ్ ఆటగాళ్లు కాగా.. 1,224 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. వీరితో పాటు అసోసియేట్ దేశాలకు చెందిన 30 మంది క్రికెటర్లు కూడా ఉన్నారు. మొత్తం 1,574 క్రికెటర్లలో ఫ్రాంఛైజీలు గరిష్టంగా 204 మందిని మాత్రమే తీసుకునే అవకాశం ఉంది. కాగా ఐపీఎల్ 2024 మినీ వేలంలో ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అత్యధికంగా రూ.24.75 కోట్ల రికార్డు ధర పలికాడు. అదే జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. రెండో స్థానంలో నిలిచాడు.

## భారత మహిళల జట్టు షెడ్యూల్ ఖరారు..

**బలగం టీవి, హైదరాబాద్**

కొత్తగా ప్రకటించిన మహిళల 2025–2029 ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో భారతదేశం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, జింబాబ్వేలకు ఆతిథ్యం ఇవ్వనుంది. అలాగే, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఐర్లాండ్‌లతో విదేశీటూర్‌లో మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మేరకు సోమవారం ఐసిసి షెడ్యూల్ ప్రకటించింది. ఎఫ్‌టీపీ అనేది ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్ నాల్గవ ఎడిషన్ మ్యాచ్‌ల షెడ్యూలింగ్. రెండవ ఎఫ్‌టీపీ మే 2025 నుంచి ఏప్రిల్ 2029 వరకు కొనసాగుతుంది. ఈ షెడ్యూల్‌లో2027లో ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ, వన్డే వరల్డ్ కప్–2025 (ఇండియా), టీ20 వరల్డ్‌కప్–2026 (యూకే), టీ20 వరల్డ్‌కప్–2028 కూడా ఉన్నాయి. ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్ల సంఖ్య ఈసారి 11కి చేరుకుంది. జింబాబ్వే తొలిసారి ఛాంపియన్‌షిప్‌లో చేరింది. ఈ ఎఫ్‌టీపీలో 2026లో జరిగే డబ్ల్యూపీఎల్ (జనవరి–ఫిబ్రవరి), హండ్రెడ్ (ఆగస్టు), డబ్ల్యూబీబీఎల్ (నవంబర్) టోర్నీలకు విడివిడిగా షెడ్యూల్ ఇచ్చారు.